ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 02-06-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సమాజంలోని అన్ని వర్గాలు ఆర్థికంగా, విద్యాపరంగా పురోగమించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ భారత్ - నేపాల్ దేశాలకు సంబంధించిన అన్ని అంశాలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి అవకాశాలు ఉన్నాయని భారత్ స్పష్టం చేసింది.
- ❖ దేశంలో ఇప్పటివరకు ఎబోలా వైరస్ కు సంబంధించి ఒక్క కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.
- ❖ ఇమిగ్రేషన్ నిబంధనల్లో కీలక మార్పులు చేస్తూ.. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

==========================

సమాజంలోని అన్ని వర్గాలు ఆర్థికంగా, విద్యాపరంగా పురోగమించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన గిరిజన లబ్ధిదారులకు ఉపకార వేతనాన్ని అందించే కార్యక్రమంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్య అనేది సాధికారతకు శక్తివంతమైన సాధనమని అన్నారు. వ్యక్తులను చైతన్యవంతులుగా, సమర్థులుగా విద్య తీర్చిదిద్దుతుందని చెప్పారు. గిరిజన వర్గాలకు చెందిన యువతకు సాధికారత కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిరంతర ప్రయత్నాలు చేస్తోందని రాష్ట్రపతి తెలిపారు. ప్రభుత్వ ఉపకార వేతన పథకాల గిరిజనుల జీవితాలను మార్చివేశాయని చెప్పారు. దేశంలో ప్రతిభకు కొరత లేదని... దానిని గుర్తించి అభివృద్ధి చెందడానికి సరైన వేదికను అందించాల్సిన అవసరం ఉందని ద్రౌపది ముర్ము తెలియచేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

==========================

ఇమిగ్రేషన్ నిబంధనలకు సంబంధించి కేంద్ర హోం శాఖ కీలక మార్పులు చేసింది. విదేశీయులు అనుమతి పొందిన సమయం కన్నా ఎక్కువ రోజులు భారత్‌లో ఉండాలంటే వారి వీసా గడువు ముగియక ముందే విదేశాంగ శాఖ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొంటూ నోటిఫికేషన్ ను ఈరోజు జారీ చేసింది. భారత్‌కు 180 రోజులు.. అంతకంటే తక్కువ గడువు వీసాలపై వచ్చే విదేశీయులకు ఈ నిబంధన వర్తిస్తుంది. మరింతకాలం దేశంలో కొనసాగాలంటే వీసా గడువు ముగియకముందే రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. గతంలో వీసా గడువు పూర్తైన తర్వాత 14 రోజుల్లోపు పొడిగింపునకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉండేది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - నేపాల్ దేశాలకు సంబంధించిన అన్ని అంశాలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి అవకాశాలు ఉన్నాయని భారత్ స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏ మూడవ పక్షం ప్రమేయం అవసరం లేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఢిల్లీలో ఈ రోజు పాత్రికేయులతో చెప్పారు. భారత్ - నేపాల్ సరిహద్దుకు సంబంధించి నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా చేసిన వ్యాఖ్యలు, అలాగే తదనంతరం నేపాల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ జారీ చేసిన ప్రకటనపై ఆయన మాట్లాడుతూ... భారత్ - నేపాల్ సరిహద్దులో దాదాపు 98 శాతం గుర్తించబడినప్పటికీ కొన్ని అపరిష్కృత విభాగాలు ఉన్నాయని తెలిపారు.

(వాయిస్ 28 సెకన్లు)

జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించి పాకిస్థాన్ - యూరోపియన్ యూనియన్ సంయుక్త ప్రకటనలో చేసిన అనవసర ప్రస్తావనలను కూడా ఆయన తప్పు పట్టారు. జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు భారతదేశంలో అంతర్భాగమని జైస్వాల్ ఉద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఇప్పటివరకు ఎబోలా వైరస్ వ్యాధికి సంబంధించి ఒక్క కేసు కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత 21 రోజుల్లో ఎబోలా ప్రభావిత దేశాల నుండి వచ్చిన వారు, అలాగే ఆ దేశం గుండా ప్రయాణించి వారికి ఎవరికైనా జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, విరేచనాల కారణం తెలియని రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తే.. వారు స్వీయ నిర్బంధంలోకి వెళ్లి, స్థానిక ఆరోగ్య అధికారులకు తెలియజేయాలని ఆ మంత్రిత్వ శాఖ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సుప్రీం కోర్టుకు కొత్తగా నియమితులైన అయిదుగురు న్యాయమూర్తులు ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ శీల్ నాగు, జస్టిస్ శ్రీచంద్రశేఖర్, జస్టిస్ సంజీవ్, జస్టిస్ అరుణ్‌పల్లి, జస్టిస్ వెంకట సుబ్రమణి న్యాయమూర్తులుగా ప్రమాణ స్వీకారం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్తగా నియమితులైన ఐదుగురు న్యాయమూర్తులతో కలిపి సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. అదే విధంగా మహిళా న్యాయమూర్తుల సంఖ్య రెండుకు చేరింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జర్మనీలోని థురింగియా రాష్ట్ర మంత్రి మారియో వోయిట్ క్వాంటం కమ్యూనికేషన్, ఫోటోనిక్స్ పరిశ్రమల నేతృత్వంలోని డీప్-టెక్ భాగస్వామ్యాలపై న్యూఢిల్లీలో ఈరోజు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... భారత్, జర్మనీ దేశాల మధ్య శాస్త్ర సాంకేతికత రంగాల్లో భాగస్వామ్యంతో పాటు ప్రజల మధ్య కూడా బలమైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారం, పరిశోధనలు, ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధి రంగాలలో కొత్త అవకాశాలను సృష్టిస్తుందని స్తున్నాయని

చెప్పారు. బయోటెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ, నీటి సాంకేతికత, కృత్రిమ మేధస్సు, అంతరిక్ష సాంకేతికతల విషయంలో అంతర్జాతీయ సహకారానికి భారతదేశం గణనీయమైన అవకాశాలను అందిస్తోందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలలో కొనసాగుతున్న ఎబోలా వైరస్ వ్యాప్తిని ఎదుర్కొనే విషయంలో ఆఫ్రికా వ్యాధి నియంత్రణ నివారణ కేంద్రాలు (CDC)లకు రెండవ విడత వైద్య సహాయాన్ని భారత్ ఈరోజు పంపింది. ఇందులో రక్షణ పరికరాలు, రోగ నిర్ధారణ పర్యవేక్షణ పరికరాలు, మందులు, పోషకాహార సప్లిమెంట్లు ఉన్నాయని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. భారతదేశం ఆఫ్రికా CDCకి వైద్య సహాయాన్ని పంపించిందని తెలిపారు. ఈ 43 టన్నుల వైద్య సామగ్రి అక్కడి ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందన్న విశ్వాసాన్ని జైశంకర్ వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఒడిశా, కోస్తాంధ్రప్రదేశ్‌లలో ఉరుములతో కూడిన వర్షాలు రానున్న 24 గంటల్లో కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ.. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అంతర్గత కర్ణాటక, కేరళం, మాహే, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి కారైకల్‌లలో భారీ వర్షాలు రేపటి వరకు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఆ వివరాలను ఐఎండీ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ వెల్లడిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ పంచాయతీ అవార్డుల 2025 ప్రదానోత్సవం న్యూఢిల్లీలో రేపు జరగనుంది. దేశవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన 42 పంచాయతీలకు అవార్డులను ఈ సందర్భంగా  ప్రదానం చేయనున్నారు. ఈ వేడుకలో `దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్` విభాగం కింద 34 గ్రామ పంచాయతీలకు, నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ విభాగం కింద 8 పంచాయతీలకు అవార్డులు అందజేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 74 వేల 267 పాయింట్ల వద్ద నష్టంతో ప్రారంభమై.. చివరికి 382 పాయింట్ల లాభంతో 74 వేల 649 వద్ద ముగిసింది. నిఫ్టీ 100 పాయింట్లు లాభపడి 23 వేల 483 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95 రూపాయల 28 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 93.96 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు ధర 4 వేల 528 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణాఫ్రికా ఉపరాష్ట్రపతి పాల్ మషతిలేతో విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ న్యూఢిల్లీలో ఈ రోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడులు, MSMEలు, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగాలలో ఉన్న అవకాశాలపై చర్చించినట్లు జైశంకర్ సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం పట్ల పాల్ మషతిలేకి ఉన్న దృఢ సంకల్పాన్ని కేంద్రమంత్రి అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్- దక్షిణాఫ్రికా కలిసికట్టుగా పనిచేయాలని కూడా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =